క్లుప్తంగా

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

సదుం: మండల నూతన తహసీల్దార్‌గా మారుఫ్ హుస్సేన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కలెక్టరేట్ డీసీఓలో సీసీగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో తహసీల్దారుగా ఉన్న నారాయణస్వామి ఎన్నికల బదిలీపై రావడంతో తిరిగి సొంత జిల్లా అనంతపురానికి వెళ్లారు.

చౌడేపల్లె తహసీల్దార్‌గా హనుమంతు


హనుమంతు

చౌడేపల్లి: మండల తహసీల్దార్‌గా బి.హనుమంతు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల విధుల్లో భాగంగా అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్లిన ఆయన తిరిగి చిత్తూరు జిల్లాలో రిపోర్టు చేశారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ ఆదేశాల మేరకు బాధ్యతలు స్వీకరించిన ఆయన మీడియాతో మాట్లాడారు. రెవెన్యూ సేవలను ప్రజలకు సత్వరమే అందించేలా పనిచేస్తానన్నారు.

నేడు పనిముట్ల పంపిణీ

పుంగనూరు: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు వివిధ రకాల పనిముట్లను ఆదివారం పంపిణీ చేయనున్నట్లు ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శివ శనివారం తెలిపారు. రాంపల్లెలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో రూ.5లక్షలు విలువ చేసే కుట్టుమిషన్లు, చిరువ్యాపారులకు గొడుగులు, వీల్‌చైర్లు, వృద్ధాశ్రమాలు, హాస్పిటల్స్, గురుకుల పాఠశాలలకు బెడ్‌షీట్లు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలాయన కోరారు.

మండల సమావేశం రద్దు

రొంపిచెర్ల: రొంపిచెర్ల మండల సర్వసభ్య సమావేశం కోరం లేక రద్దయ్యిందని ఎంపీడీఓ రెడ్డెప్పచ్చారి శనివారం తెలిపారు. శనివారం జరగాల్సిన మండల సమావేశానికి ఎంపీటీసీలు ఎవరూ హాజరు కాకపోవడంతో సమావేశం రద్దయ్యిందన్నారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి మూడో సమావేశానికి సభ్యులకు నోటీసులు ఇస్తామని తెలిపారు. మూడో సమావేశానికి హాజరు కాకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ పేర్కొన్నారు.

వయనాడ్ బాధితులకు అండగా నిలుద్దాం

- సీపీఎం విరాళాల సేకరణ


విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నేతలు

పలమనేరు: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ ప్రజలకు అండగా నిలుద్దామని జిల్లా సీపీఎం నాయకులు వాడ గంగరాజు పిలుపునిచ్చారు. ఆమేరకు స్థానిక సీపీఎం నాయకులతో కలసి పట్టణంలో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కడ ప్రాణ నష్టం ఎక్కువగా ఉందని కనీసం అక్కడి ప్రజల కనీస సౌకర్యాల కోసం మనం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇలాంటి విపత్తు సమయంలో ప్రతిఒక్కరూ అండగా నిలవాలని కోరారు. సీపీఎం నేతలు ఓబుల్‌రాజు, గిరిధర్, భువనేశ్వరి పాల్గొన్నారు.

5న మంత్రి పర్యటన

పుంగనూరు: రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఈనెల 5న సోమవారం పుంగనూరులో పర్యటించనున్నట్లు తహసీల్దార్ శివయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశాన్ని ట్రావెలర్స్ బంగ్లాలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి ప్రతిఒక్కరూ హాజరుకావాలని కోరారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ


పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ

కుప్పం: పట్టణంలోని ప్రభుత్వ ఎంఎఫ్‌సీ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. శనివారం కళాశాల ప్రాంగణంలో ఉచితంగా ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను ఆయన అందజేశారు.

న్యాయవాది గవాస్కర్‌పై తప్పుడు కేసు

చిత్తూరు అర్బన్: విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది ఒగ్గు గవాస్కర్‌పై అక్కసుతోనే పోలీసులు తప్పుడు కేసులో ఇరికించారని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ చిత్తూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు సూర్యప్రతాప్ మండిపడ్డారు. శనివారం ఆయన మాట్లాడుతూ గత నెల 26వ తేదీన ఓ పార్టీ ఆఫీసుపై దాడి అనే అభియోగంలో ముద్దాయిల తరపు మంగళగిరి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన గవాస్కర్‌ను కావాలనే 88వ ముద్దాయిగా చేర్చారని ఆరోపించారు. పోలీసులు ఎవరి మెప్పు కోసమో అధికార దుర్వినియోగానికి పాల్పడితే భవిష్యత్‌లో ముప్పు తప్పదని హెచ్చరించారు.

తల్లిపాలే అమృతం!

- తల్లిపాల వారోత్సవాలతో లాభాలు
- బిడ్డకు తల్లిపాలను మించింది ఏదీ లేదు
- తల్లీబిడ్డల మధ్య ప్రేమానురాగాలను పెంపొందిస్తుంది




తల్లిపాల వారోత్సవాలను ఏరియా ఆస్పత్రిలో ప్రారంభిస్తున్న వైద్య సిబ్బంది

పలమనేరు: నేడు మార్కెట్‌లో పిల్లల కోసం ఎన్నో రకాల బ్రాండ్ల పౌష్టికాహార ప్యాకెట్‌లు లభిస్తున్నా తల్లిపాలను మించింది ఏదీ లేదు. శిశువుకు తల్లిపాలు అందించే పోషణ మరెక్కడా దొరకదు. తల్లిపాలతో లభించే రోగనిరోధకశక్తి ఎన్ని రకాల విటమిన్లు, ఖనిజాలు, టానిక్కులు తాగినా రాదు. తల్లిపాల విశిష్టతను చాటేందుకు ప్రతిఏటా ఆగస్టు తొలి వారాన్ని తల్లిపాల వారంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ అమలు చేస్తోంది. ఆమేరకు పలమనేరు నియోజకవర్గంలో ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిల్లో ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల ప్రాముఖ్యతపై బాలింతలకు అవగాహన కార్యక్రమాలు సాగుతున్నాయి.

ఆరు నెలలు తల్లిపాలు అవసరం..

తొలి ఆరునెలలు కచ్చితంగా తల్లిపాలను పట్టించాలి. ఆపై అనుబంధ ఆహారాన్ని అందించినా తల్లిపాలే శ్రేష్టం. ఆవిధంగా కనీసం ఆరునెలల గరిష్టంగా రెండేళ్ల దాకా తల్లిపాలను పట్టించాలని డబ్ల్యూహెచ్ఓ సూచించింది. ఐదేళ్లలోపు పిల్లల్లో 55 శాతం పిల్లలు తక్కువ బరువుతో ఉన్నారు. కేవలం 24 శాతం మంది పిల్లలకు మాత్రమే తల్లులు తొలి ఆరునెలల్లో పాలు పడుతున్నట్టు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే చెబుతోంది. మొదటి ఆరు నెలలు తల్లిపాలను పట్టడంతో శిశు మరణాలను చాలా వరకు అరికట్టవచ్చు. తల్లిపాల విశిష్టతపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరమెంతైనా ఉంది.

తల్లిపాలతో లాభాలెన్నో..

- తల్లిపాలలోని కొలస్ట్రమ్ శిశువు జీర్ణవ్యవస్థకు సహకరిస్తుంది.
- అందులోని కొవ్వు ఆమ్లాలు బిడ్డ మెదడు చురుగ్గా పనిచేసేలా చూస్తుంది.
- పాలలోని యాంటీ బాడీలు రోగనిరోధక శక్తిని పెంచి అంటు రోగాలు రాకుండా చేస్తాయి.
- నిద్రలోనే సంభవించే శిశుమరణాలను తల్లిపాలు నివారిస్తుంది.

కలవరపెడుతున్న శిశు మరణాలు..

మనదేశంలో శిశుమరణాలు ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగించే అంశం. ఏటా 2.6 కోట్ల మంది శిశువులు జన్మిస్తుండగా వారిలో 12 లక్షలమంది పుట్టిన నెలలోపే మరణిస్తున్నారు. 30 శాతం మంది పిల్లలు ఐదేళ్లలోపు మృతిచెందుతున్నారు. ప్రపంచంలోనే శిశు మరణాలు అత్యధికంగా మనదేశంలోనే ఉన్నట్టు తాజా ఆర్థిక సంఘ నివేదికలో తేలింది. పిల్లలకు తల్లిపాలు పట్టకపోవడం వలన ఏర్పడే పౌష్టికాహారలోపం జీవితాంతం వేధిస్తుంది.

తల్లికి ఎంతగానో మేలు.....

పాలు పట్టే తల్లి శరీరంలో ఆక్సిటోసిన్ అనే హార్మోన్ విడుదలై గర్భాశయం తిరిగి సాధారణ పరిమాణానికి కుచించుకుపోయేలా చేస్తుంది. ప్రసవానంతరం అధి రక్తస్రావం జరగకుండా నివారిస్తుంది. వేగంగా బరువు తగ్గడానికి ఉపకరిస్తుంది. రొమ్ము, గర్భాశయ, అండాశయ క్యాన్సర్లు నుంచి కాపాడుతుంది.

మరింత ప్రచారం అవసరం..

ప్రస్తుతం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు లక్ష్యసాధనకై మరింత ప్రచారం చేయాలి. ముఖ్యంగా స్త్రీ, శిశు వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, సామాజిక వైద్య నిపుణులు తల్లిపాల ప్రయోజనాలను విస్తృత ప్రచారం చేయాలి. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ శాఖ మాత్రం సంబంధిత అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, తల్లులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

తల్లి పాల ప్రాధాన్యతను గుర్తించాలి..



తల్లిపాల ప్రాధాన్యతను ప్రతిఒక్కరూ గుర్తించాలి. బిడ్డకు కావాల్సిన అన్ని పోషక పదార్థాలు, రోగనిరోధక శక్తి తల్లిపాలలో ఉంటాయి. చక్కటి పోషణ, మంచి బుద్ధి, వెలకట్టలేని తల్లి పిల్లల ప్రేమానుబంధం దొరుకుతుంది. తప్పకుండా బిడ్డకు ఆరునెలల దాకా తల్లిపాలను పట్టించాలి.
–కోమల, న్యూట్రీషన్ కౌన్సిలర్, పలమనేరు

తల్లి పాలే బిడ్డకు శ్రీరామరక్ష..



తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష. ప్రాణాంతక వ్యాధుల నుంచి బిడ్డకు రక్షణ లభిస్తుంది. పుట్టిన వెంటనే ముర్రుపాలను పట్టించడంతో బిడ్డకు భవిష్యత్తులో గుండె జబ్బు, క్యాన్సర్, బీపీ, శ్వాసకోశ వ్యాధులు, ఎలర్జీలను గట్టిగా ఎదుర్కోగల రోగనిరోధక శక్తి ఉంటుంది. దీంతో తల్లి, బిడ్డలకు ఎంతో మేలు చేకూరుతుంది. ఈ విషయాలను తెలిపేందుకు ప్రస్తుతం తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నాం.
–ఇందిరా ప్రియదర్శిని, ఐసీడీఎస్ సీడీపీఓ, పలమనేరు

ఈ కాలంలో బిడ్డకు పాలివ్వాలన్నా తల్లికి సిగ్గే..



ఈకాలంలో తల్లి బిడ్డకు పాలివ్వడానికి మొహమాటపడుతున్నారు. ఇప్పుడు పాలివ్వక్కుండా బుడ్డీ నోట్లో పెట్టడం ఓ ఫ్యాషన్ అయిపోయింది. మా కాలంలో మేము బిడ్డ రెండేళ్ల దాకా పాలుపట్టేవాళ్లం. తల్లి వడిలో బిడ్డ ఉండడంతో ఆ తల్లిపై బిడ్డకు మమకారం, ప్రేమ పుడతాయి.
–రత్నక్క, ఆదర్శరైతు, కొలమాసనపల్లి

తల్లి పాలతోనే మానసిక వికాసం


బైరెడ్డిపల్లె: అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ


అవగాహన కల్పిస్తున్న వనలక్ష్మి

బైరెడ్డిపల్లె: తల్లిపాలు అమృతంతో సమానమని, తల్లిపాల విశిష్టతను చాటి చెప్పేందుకు ప్రతిఏటా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ మాధవిలత పేర్కొన్నారు. బైరెడ్డిపల్లెలో శనివారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 6 నెలల వరకు బిడ్డకు తల్లిపాలనే ఇవ్వాలన్నారు. సంఘమిత్రలు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వి.కోటలో..

వి.కోట: తల్లిపాలతోనే బిడ్డకు శారీరక, మానసిక వికాసం ఎక్కువగా ఉంటుందని అంగన్‌వాడీ కార్యకర్త వనలక్ష్మి అన్నారు. శనివారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పాపేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భవతులు, బాలింతలకు చంటిబిడ్డల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పుట్టిన గంటలోపు బిడ్డకు ముర్రుపాలు తాగించాలని సూచించారు. పుట్టినప్పటి నుంచి 180 రోజులపాటు తప్పక తల్లిపాలు తాగించాలన్నారు. అనంతరం బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.

మదర్‌థెరిసా అధ్యాపకులకు డాక్టరేట్



అనిల్‌కుమార్, నవీన్‌కుమార్

గంగవరం: మండలంలోని మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు అనిల్‌కుమార్, నవీన్‌కుమార్‌లకు వేలూరులోని వీఐటీ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కరెస్పాండెంట్ రవీంద్రబాబు శనివారం తెలిపారు. వీరిద్దరూ కలసి పలు పరిశోధనలు చేసి సిద్ధాంత వ్యాసాలను సమర్పించినందుకుగానూ డిగ్రీలను ప్రదానం చేసినట్లు తెలిపారు. డాక్టరేట్‌లు పొందిన అధ్యాపకులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

బొలెరోను ఢీకొన్న బైక్

- వ్యక్తికి తీవ్రగాయాలు

చౌడేపల్లె: బైక్ అదుపుతప్పి ఆగిఉన్న బొలెరో వాహనాన్ని ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన చౌడేపల్లె– పలమనేరు రోడ్డులోని చిట్టిరెడ్డిపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. దిగువపల్లె పంచాయతీ నగిరిమిట్టపల్లెకు చెందిన శివ(35). ఇతను బైక్‌లో రాత్రి చౌడేపల్లె వైపు వెళుతుండగా చిట్టిరెడ్డి సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడు పక్కన ఆగిఉన్న బొలెరో వాహనాన్ని ఢీకొన్నాడు. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ నాగరాజు

మెలకువలు పాటించాలి

గుడుపల్లె: వేరుశనగ పండించే రైతులు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాఖాధికారి నాగరాజు పేర్కొన్నారు. శనివారం కనమనపల్లెలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వేరుశనగ పంటను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. వేరుశనగ పంటల్లో అదనంగా అంతర పంటలు వేసుకోవడం ద్వారా అధిక దిగుబడులు వస్తాయన్నారు.

అంతన్నారు... ఇంతన్నారు

- బియ్యం ఇచ్చి చేతులు దులుపుకుంటున్న కూటమి ప్రభుత్వం
- నిత్యావసరాలు ఇవ్వకుండా రెండు నెలలుగా ఎగనామం
- ఇది కోతల ప్రభుత్వం అంటున్న జనం


కడపనత్తంలో ఎండీయూ వాహనంలో లబ్ధిదారులకు బియ్యం ఇస్తున్న సిబ్బంది

బైరెడ్డిపల్లె: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో వస్తే ప్రజలను అందలమెక్కిస్తామని చెప్పి ప్రచార వాగ్దానాలు చేశారు. చౌకదుకాణాల ద్వారా పేదలకు సబ్సిడీపై బియ్యం, కందిపప్పు, చక్కెర, గోధుమపిండి వస్తువులను సరఫరా చేస్తామని చెప్పిన మాటలు నీటి మూటలుగా మారాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కార్డులోని ప్రతి లబ్ధిదారునికి 5 కిలోల ఉచిత బియ్యం, కుటుంబానికి కిలో కందిపప్పు, అర కిలో చక్కెర, కిలో గోధుమపిండి ఇంటి దగ్గరకే వచ్చి మొబైల్ వాహనంలో లబ్ధిదారులకు సరఫరా చేసింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత రెండు నెలలగా రేషన్ లబ్ధిదారులకు బియ్యంతో సరి పెడుతోంది. రెండు నెలల నుంచి కందిపప్పు, చక్కెర, గోధుమపిండి ఇవ్వకుండా ఎగనామం పెడుతోంది. బియ్యం ఇచ్చి చేతులు దులుపుకుంటుండడంతో ఇది కోతల కూటమంటూ జనం మండిపడుతున్నారు. ఎన్నికలకు ముందు అంత..ఇంత అని చెప్పి ఇప్పుడు అధికారంలోకి వచ్చిక ఏమీలేక చేస్తున్నారని ప్రజలు నిరాశ చెందుతున్నారు. మండల పరిధిలో 36 చౌకదుకాణాలు ఉండగా 17,396 కార్డుదారులు ఉన్నారు.

గత ప్రభుత్వంలో ఇళ్ల వద్దకే..

పేదలు, వృద్ధులు, మహిళలకు ఆర్థిక భరోసా ఇచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలన్నీ లబ్ధిదారుల ఇళ్ల వద్దకే చేర్చింది. ముఖ్యంగా రేషన్ కార్డుదారులు ఇబ్బంది పడకుండా ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందజేసింది. దీంతో వృద్ధులకు, దివ్యాంగులకు ఎంతో మేలు జరిగింది. మన రాష్ట్రంలో ఈ పథకం అమలు చేయడంతో దేశంలోని అనేక రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకున్నాయి. పేదలకు ముంగిళ్లలో సేవ, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో రూపొందిన పథకం గడచిన ఐదేళ్లుగా విజయవంతంగా అమలు చేశారు. కానీ తాజాగా అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది.

నిత్యావసర సరుకులు ఇవ్వాలి..

గత ప్రభుత్వంలో లబ్ధిదారులందరికీ రేషన్ సరుకులు బాగా ఇచ్చారు. అయితే రెండు నెలలుగా కూటమి ప్రభుత్వంలో నిత్యావసర సరుకులు సరఫరా చేయలేదు. చక్కెర, కందిపప్పు, గోధుమపిండి ఇవ్వాలి. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ అందించాలి. దీని వల్ల వాహన డ్రైవర్లకు ఉపాధి, ఎందరికో మేలు జరుగుతుంది.
–వెంకటప్ప, కడపనత్తం

అయ్యప్పస్వామి సేవలో పెద్దిరెడ్డి


అయ్యప్పస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వారకనాథరెడ్డి

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె కోటమల్లై అయ్యప్పస్వామి ఆలయంలో ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి శనివారం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో ఉన్న వినాయక, ఆంజనేయ, నాగమల్లేశ్వర స్వామి ఆలయాల్లో పూజలు చేశారు. అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు వారిని కలిశారు. ఎళ్ల వేళలా తాము అండగా ఉంటామని వారికి ఎమ్మెల్యేలు భరోసా ఇచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, నేతలు హనుమంతరెడ్డి, మురళీరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, వైస్‌ఎంపీపీ ధనుంజయరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, నారాయణరెడ్డి, పుత్రాజు, గిరిధర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, ఇమ్రాన్, గణేష్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.


నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పక్కా ఇళ్లను కట్టుకోండి

- మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి


బొమ్మిదొడ్డి కాలనీలో ఆగిన ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు: పట్టణ సమీపంలోని జగనన్న కాలనీలో ఇప్పటికీ ఇళ్లు నిర్మించని వారు, వివిధ దశల్లో పనులను ఆపేసిన వారు వెంటనే పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి సూచించారు. ఆమేరకు స్థానిక హౌసింగ్ శాఖతో కలసి శనివారం ఆయన గడ్డూరు కాలనీలో అర్థంతరంగా ఆగిన ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. ఆపై వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. వెంటనే స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టని వారితో సమావేశాన్ని నిర్వహించారు. బిల్లులు తప్పకుండా వస్తాయని పనులు ప్రారంభించాలని సూచించారు. అనంతరం స్థానిక రాధాబంగ్లా సమీపంలో నిర్మించనున్న ఎస్టీపీ(సెవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) స్థలాన్ని సందర్శించారు. పక్కనే ఉన్న పెద్దచెరువు కట్టపై వ్యర్థాలను జేసీబీ వాహనం ద్వారా శుభ్రం చేయించారు. ఆయన వెంట మున్సిపల్ ఏఈ రూపేష్, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కాలినడకన తిరుమలకు ..


అన్నవరం క్రాస్ వద్ద కాలినడకన భక్తులు

వి.కోట: కలియుగదైవం తిరుమల వెంకన్నను దర్శించుకోవడానికి భక్తులు కాలినడకన శాంతిపురం మండలం నుంచి తిరుమలకు బయలుదేరారు. ఆ భక్తుల యాత్ర శనివారం వి.కోట మండలం మీదుగా సాగింది. భక్తులను వివరణ కోరగా తమ మొక్కులను చెల్లించుకోవడానికి ప్రతి ఏటా శ్రావణమాసం కాలినడకన వెళ్లి స్వామివారిని దర్శించుకుంటామన్నారు. తమ యాత్ర శనివారం ప్రారంభమైందని, మూడురోజులపాటు నడిచి నాల్గవ రోజు శ్రావణమాసంలో స్వామి వారికి తలనీలాలు సమర్పించి దర్శనానికి వెళతామని తెలిపారు.

ఘనంగా ఆడి–18 వేడుకలు


మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

గుడుపల్లె: ఆడి నెల ప్రారంభమై 18 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా గుడివంక శ్రీ వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శనివారం ఆడి–18 వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులోభాగంగా శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని పట్టు వస్త్రాలు, వివిధ పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం స్వామి వారికి రుద్రాభిషేకం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు కావళ్లతో గుడివంక ఆలయానికి వచ్చి పశ్చిమవాహినిలో స్నానాలు ఆచరించి గంగ పూజలు నిర్వహించారు. అనంతరం కొండపైకి హరోహర అంటూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఆలయం ఎదుట కావళ్లతో మొక్కులు తీర్చుకుని స్వామి వారిని దర్శనం చేసుకున్నారు.

దుర్గంధంలో కుప్పం

- రోడ్డుపైనే మురుగునీటి ప్రవాహం
- దోమలతో పట్టణ వాసులకు ఇబ్బందులు


తంబిగానిపల్లి వద్ద రోడ్డుపై మురుగునీరు

కుప్పం: మురుగనీటి కాలువలు లేకపోవడంతో కుప్పం మున్సిపాలిటీ పరిధిలో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తూ దుర్గంధం వెదజల్లుతోంది. ప్రధానంగా కుప్పం నుంచి తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి వెళ్లే జాతీయ రహదారిపై మురుగునీరు ప్రవహిస్తుండడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీలోని తంబిగానిపల్లి కాలనీ వద్ద రోడ్డు పక్కన ఉన్న మురుగునీటి కాలువ పూడిపోవడం వల్ల నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. ఈ కాలువలో పూడిక తీయాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని కాలనీ వాసులు మండిపడుతున్నారు. మురుగునీటితో దోమలు ఎక్కువై ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలో కుక్కల బెడద ఎక్కువైందని అన్నారు. సంబంధిత అధికారులు ఈ సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సస్యరక్షణతో వేరుశనగలో అధిక దిగుబడి


పొలంబడిలో ఏడీఏ నాగపద్మిని

తవణంపల్లె: రైతులు సకాలంలో సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే వేరుశనగలో అధిక దిగుబడి సాధ్యమని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ నాగపద్మిని సూచించారు. శనివారం మండలంలోని టి.పుత్తూరులో పొలంబడి కార్యక్రమంలో భాగంగా మేలైన వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులు వేరుశనగ సాగులో తొలుత విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు. ఒక కిలో విత్తనానికి 10 గ్రాముల ట్రైకోడెర్మా విరిడితో విత్తనశుద్ధి చేసుకుంటే ముచ్చు కుళ్లు తెగులును అరికట్టవచ్చని తెలిపారు. అదే విధంగా వేరుశనగ పంట చుట్టూ జొన్న, మొక్కజొన్న, ఆముదం పంటలను కంచె పంటగా వేసుకుంటే రసం పీల్చే పురుగులను సమర్థవంతంగా అరికట్టవచ్చని వివరించారు. వేరుశనగలో అంతర పంటగా కంది, అలసంద పంటలను సాగు చేస్తే అదనపు ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. పురుగుల వృద్ధి ఎక్కువగా ఉంటే వేపనూనె 5 ఎంఎల్ లీటరు నీటిలో పిచికారీ చేస్తే నివారణ సాధ్యమని తెలిపారు. వేరుశనగ పంటలో రెండోసారి కలుపు తీసే ముందు జిప్సం ఎరువును ఎకరాకు 200 వందల కేజీలు వాడడంతో నాణ్యమైన, అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. ఏఓ ప్రవీణ్ మాట్లాడుతూ భూసార పరీక్షలు చేసుకుని పంటలు సాగు చేసుకోవాలని సూచించారు.